
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 8 అక్టోబరు 2024

గరిష్ఠం 33.0
కనిష్ఠం 23.4





బాలికపై లైంగిక దాడి

● పోలీసుల అదుపులో నిందితుడు

చండూరు రూరల్, అక్టోబరు 7: చాక్లెట్లు కొనిస్తానని బాలికను దుకాణానికి తీసుకెళ్లిన ఓ యువకుడు ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా చండూరు మండలంలో ఈ సంఘటన జరిగింది. చండూరు సీఐ వెంకటయ్య తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం తాపీ పని చేసేందుకు కొన్నేళ్ల క్రితం మండలంలోని ఓ గ్రామానికి వచ్చింది. ఆ దంపతులకు ఇద్దరు కుమార్తెలు కాగా, తల్లి అనారోగ్యంతో ఐదేళ్ల క్రితం మృతిచెందింది. దీంతో తండ్రి మరో వివాహం చేసుకుని హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇద్దరు బాలికలు(11, 8 సంవత్సరాలు) తాత, నానమ్మతో కలిసి గ్రామంలోనే ఉంటూ చదువుకుంటున్నారు. బాలిక తాత గ్రామంలో కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కూలి పనులు చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం దేవరపాడు గ్రామం నుంచి వచ్చిన వాటుపల్లి బాబి(24) వారు ఉండే వీధిలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజులుగా బాలికల తాతతో పరిచయం పెంచుకుని రోజూ మద్యం తాగించేవాడు. అదే పరిచయంతో శనివారం రాత్రి వారి ఇంటికి వచ్చి బాలికల తాతకు మద్యం తాపించాడు. చాక్లెట్లు కొనిస్తానని బాలికను(8) సమీపంలోని ఓ దుకాణానికి తీసుకువెళ్లి తిరిగిరాలేదు. కొద్దిసేపటికి ఇంటికి వచ్చిన బాలిక తనపై జరిగిన లైంగిక దాడి గురించి తాతకు చెప్పింది. ఆయన గ్రామంలో తెలిసిన వారికి సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఉదయం బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు బాబిపై పోక్సో కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటయ్య తెలిపారు. బాలికను వైద్య పరీక్షలకు పంపనున్నట్లు తెలిపారు.

బ్యాంకు అధికారులమని రైతులకు బురిడీ

● తక్కువ వడ్డీకి రుణాల పేరుతో మోసం ● ఏడుగురు సభ్యుల అరెస్టు.. ఒకరు పరారీ ● జిల్లాలో 28మంది రైతుల నుంచి రూ. 26లక్షలు వసూలు

నల్లగొండ క్రైం, అక్టోబరు 7: బ్యాంకు అధికారులుగా చలామణి అవుతూ తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని రైతులు, వ్యాపారులను మోసం చేస్తోన్న ఏడుగురిని నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి రూ.1.65లక్షల నగదు, పలువురు రైతుల పట్టాదారు పాస్‌పుస్తకాలు, అగ్రిమెంట్ డాక్యుమెంట్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ ముఠా సభ్యుల వివరాలు వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్, నగదు, పట్టాదారు పాసుపుస్తకాలు, అగ్రిమెంట్ డాక్యుమెంట్లు స్వాధీనం

వ్యవసాయం చేస్తూ నకిలీ ఫీల్డ్ ఆఫీసర్‌గా అవతారమెత్తి

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే షేక్ నజీర్‌కు పెద్దవూర మండలం వెలుగూడెంకు చెందిన కట్టెబోయిన పరమేష్, మిర్యాలగూడ మండలానికి చెందిన రాజేశ్, మాడ్గులపల్లి మండలం చిరుమర్తికి చెందిన కొండా శ్రీను, మిర్యాలగూడ బాపూజీనగర్‌కు చెందిన గోగుల సురేష్, మిర్యాలగూడ మండలం జప్తీవీరప్పగూడేనికి చెందిన చిలుముల సైదులు, పెద్దవూర మండలం తెప్పలమడుగుకు చెందిన పల్లెబోయిన నాగరాజు, నార్కట్‌పల్లి మండలం అంబేడ్కర్ కాలనీకి చెందిన ముప్పిడి సైదులు పరిచయమయ్యారు. వీరు ఆయా బ్యాంకుల్లో ఫీల్డ్ ఎంక్వైరీ అధికారులమని నమ్మించి రైతులు, వ్యాపారస్తుల వద్దకు వెళ్లి తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేయిస్తామని చెప్పేవారు. భూములు సర్వే చేసి అవసరమైన డాక్యుమెంట్లు సిద్ధం చేసేవారు. ముందస్తుగా రైతులు, వ్యాపారుల నుంచి కొంత నగదును తీసుకునేవారు. వాటి గురించి అడిగినప్పుడు ఏదో సాకు చెప్పి దాట వేస్తూ రుణాలు ఇప్పించకుండా తప్పించుకు తిరుగుతున్నారు. జిల్లాలోని పెద్దవూర, తిరుమలగిరి(సాగర్), నిడమనూరు, నేరేడుగొమ్ము, దేవరకొండ, పీఏపల్లి మండలాల్లో 28మంది రైతులు, హాలియాలో ఓ వ్యాపారికి సాంఘిక సంక్షేమ శాఖల నుంచి నుంచి అధిక మొత్తంలో రుణం ఇప్పిస్తామని చెప్పి అందరినుంచి రూ.26లక్షల నగదు వసూలుచేశారు.

అనుమానాస్పదంగా తిరుగుతూ..

సోమవారం పెద్దవూర పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ముఠా సభ్యులు అనుమానంగా కనిపించడంతో పెద్దవూర ఎస్ఐ వీరబాబు తన సిబ్బందితో విచారించగా చేసిన నేరాలను అంగీకరించారు. వీరిలో షేక్ వజీర్ పరారీలో ఉన్నారు. సమావేశంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, నాగార్జునసాగర్ సీఐ బీసన్న, పెద్దవూర ఎస్ఐ వీరబాబు, సిబ్బంది ఉన్నారు. నిందితుల నుంచి రూ.1.65లక్షల నగదు, పట్టాదారు పాస్‌పుస్తకాలు, అగ్రిమెంట్ డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.26లక్షలు నగదు వసూలు చేయగా, మిగిలిన మొత్తం ఎలా ఖర్చుచేశారనే దానిపై వివరాలు సేకరిస్తున్నారు.

లింగాలగూడెంలో క్షుద్రపూజల కలకలం

కనగల్, అక్టోబరు 7: నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని లింగాలగూడెం గ్రామంలో సోమవారం క్షుద్రపూజలు కలకలం సృష్టించాయి. గ్రామానికి చెందిన బొబ్బలి నర్సింహ, గన్నెబోయిన వెంకన్న ఇళ్లలో ఆదివారం అర్ధరాత్రి దాటాక గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. సోమవారం ఉదయం మూటలను గమనించి విప్పిచూడగా అందులో పసుపు,కుంకుమలు, జీడిగింజలు, గవ్వలు, నిమ్మకాయలు, పేపర్‌పై రతిగీసినబొమ్మలు, తాటిఆకులతో చేసినబొమ్మలు, నిమ్మకాయలు తదితర వస్తువులు కన్పించాయి. దీంతో గ్రామస్థులు భయందోళనకు లోనయ్యారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలిపారు. రెండు నెలల క్రితం ఓసారి, పదిరోజుల క్రితం మరోసారి ఇదేరీతిలో క్షుద్రపూజలు చేసిన వస్తువులు పడేసివెళ్లినట్లు వివరించారు.

ఈ విషయమై ఎస్ఐ విష్ణుమూర్తిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా క్షుద్రపూజల పేరుతో గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. గ్రామంలో క్షుద్రపూజలు, బాణమతి, బాల్యవివాహాలు తదితర సామాజిక రుగ్మతులపై పోలీస్‌శాఖ తరుపున కళాజాతా కార్యక్రమాలను నిర్వహించి గ్రామస్థులు చైతన్య పరుస్తామని ఆయన వివరించారు.

కుమారుడిని చంపి.. తల్లి ఆత్మహత్య

● కొంతకాలంగా మానసిక రుగ్మతతో సతమతం ● యాదాద్రిభువనగిరి జిల్లాలో ఘటన

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 7: మానసికస్థితి సరిగా లేని ఓ తల్లి కుమారుడిని చంపి, తానూ ఆత్మహత్య చేసుకుంది. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ కె.భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జడల రాజు యాదవ్‌కు అదే గ్రామానికి సోని(29)తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. రాజు స్టేజీ డెకరేషన్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలంగా సోని అనారోగ్యంతో బాధపడుతోంది. మానసిక రుగ్మతతో (తనకు భయం వేస్తోందని, బుగులుగా ఉంటోందని వెళ్లేది) తరుచూ తల్లిగారింటికి వెళ్తుండేది. మూడు రోజుల క్రితం తల్లిగారింటికి వెళ్లి ఆదివారం వచ్చింది. సోమవారం ఉదయం భర్త రాజు పనిపై బయటకు వెళ్లాడు. అత్తామామలు కూడా పని నిమిత్తం బయటికి వెళ్లారు. ఇంట్లో సోని తన ఇద్దరు కుమారులు చింటు(7), రేయాన్స్(5)తో ఉంది. పని ముగించుకుని సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన రాజుకు గదిలో రేయాన్స్ అచేతనంగా పడి ఉండడాన్ని కిటికీలోనుంచి గమనించాడు. ఫ్యాన్‌కు సోని వేలాడుతుండడాన్ని చూసి ఇరుగుపొరుగు సహాయంతో ఇద్దరినీ భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారిద్దరూ మృతిచెందారని డాక్టర్లు నిర్ధారించారు. పెద్ద కుమారుడు చింటును స్నేహితులతో ఆడుకోవాలని చెప్పి బయటికి పంపటంతో తల్లి, రేయాన్స్‌లు ఇద్దరే ఇంటి వద్ద ఉన్నారు. గదిలోకి వెళ్లి తలుపునకు గడియ పెట్టిన అనంతరం రేయాన్స్‌ను గొంతు నులిమి చంపి, ఆ తర్వాత ఆమె కూడా ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు కుటుంబసభ్యులు గుర్తించారు. మృతదేహాలను భువనగిరి ఏరియా పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి మార్చురీలో ఉంచారని ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. సోని, రాజు దంపతులు అన్యోన్యంగా ఉండేవారని, ఎలాంటి గొడవలు లేకుండా ఉన్నారని స్థానికులు తెలిపారు. తరుచూ తనకు భయంవేస్తోందని అక్కడక్కడా చూపించుకొనేదని వారు తెలిపారు.



సోని, రేయాన్స్(ఫైల్)

కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది..

బీబీనగర్: కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచుకుంద గ్రామానికి చెందిన జీలిగే సునీల్(34) 15 సంవత్సరాల క్రితం కుటుంబంతో సహా బీబీనగర్ పట్టణానికి వలస వచ్చి గోళి నరేందర్‌రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో కూలిగా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా కుటుంబ సమస్యలతో ఇబ్బంది పడుతూ జీవితంపై విరక్తి చెంది మనస్తాపంతో ఆదివారం ఇందిరమ్మ కాలనీలో అద్దె ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సునీల్ సోదరుడు సంజీవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతూ..

అడవిదేవులపల్లి: నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని మొల్కచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని బాలాజీతండాలో ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీతండాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రమావత్ తుల సీరాం భార్య వాలి(27) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. తన వల్ల కుటుంబసభ్యులు ఇబ్బందులు పడుతున్నారని మానసిక ఆవేదనకు గురై ఇంట్లో ఎవరూ గమనించని సమయంలో సోమవారం తెల్లవారుజామున ఇంట్లో పైకప్పుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం నిద్రలేచి చూసిన కుటుంబసభ్యులు వాలి ఉరి వేసుకొని ఉండడాన్ని గమనించి స్థానికు సహాయంతో వెంటనే కిందికి దించి పరిశీలించారు. అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వాలి తండ్రి వస్రాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చివ్వెంల, అక్టోబరు 7: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని గుంపుల గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుంపుల గ్రామానికి చెందిన మట్టపల్లి సందీప్(23) తన తండ్రి శ్రీనుయాదవ్‌కు అనారోగ్యంగా ఉండడంతో తన మోటారు సైకిల్‌పై తండ్రిని తీసుకొని సూర్యాపేటకు వెళ్లి ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద దింపాడు. తిరిగి బైక్‌పై ఇంటికి వస్తుండగా మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గుంపుల గ్రామం వద్ద గల యూటర్న్ తీసుకుంటున్న సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న కారు సందీప్ బైక్‌ను ఢీకొంది. దీంతో సందీప్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సందీప్ తండ్రి శ్రీనుయాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సందీప్ మృతదేహం

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 7: యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట నల్లచెరువులో సోమవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక నల్లచెరువులో సోమవారం ఉదయం కుళ్లిపోయిన పురుషుడి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహంపై నలుపురంగు జీన్‌ప్యాంట్ ఉందని, ఎడమ చేతిపై 'ఎమ్మెల్యే' అని రాసి ఉంది. రెండు చెవులకు రింగులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇసుక డంపులు సీజ్



ఇసుక డంపులు పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 7: సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లి గ్రామ శివారులో కొందరు ఏరు నుంచి ఇసుక తరలించి సమీపంలో ఉన్న వ్యవసాయ భూముల్లో ఇసుక డంపులు ఏర్పాటు చేస్తున్నారు. వీటిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలకు రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించారు. ఇసుక డంపులను సోమవారం పరిశీలించి సీజ్ చేశారు. అనంతరం గ్రామపంచాయితీ పోలీసులకు, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆర్ఐ ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ ఇసుక డంపు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేషన్ బియ్యం ఉన్నాయని సమాచారంతో..

చివ్వెంల, అక్టోబరు 7: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని దురాజ్‌పల్లి గ్రామంలోని ఓ దాబాలో రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు సమాచారంతో పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దురాజ్‌పల్లి సమీపంలోగల రేణుక ఫ్యామిలీ దాబాలో రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. మండలంలోని కోటినాయక్‌తండాకు చెందిన శేషులాల్ నిల్వ ఉంచిన బియ్యం రేషన్ బియ్యమని ఆరోపణలు రావడంతో నిర్ధారించేందుకు సివిల్‌సప్లయ్ అధికారులు సమాచారం ఇవ్వడంతో అధికారులు బియ్యాన్ని పరిశీలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పీడీఎస్ బియ్యం కావని ప్రాథమిక విచారణలో తెలిపారు. రేషన్ బియ్యమా కాదా అని నిర్ధారించడానికి పట్టుబడిన బియ్యం నమూనాలను పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఇద్దరికి ఏడు సంవత్సరాల జైలు శిక్ష

ఆలేరు రూరల్, అక్టోబరు 7: ఆయుధాలతో ఇతరులను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరికి భువనగిరి అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. ఆలేరు ఎస్ఐ రజినికర్ సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా పాల్వంచ మండలంలోని వెంగళరావుకాలనీకి చెందిన రాంబాబు ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ దిల్‌సుఖ్‌నగర్‌లోని ద్వారాకాపురి కాలనీ నివాసముంటున్నాడు. వరంగల్ జిల్లా కేసముద్రం మండలంలోని మహమూద్‌పట్నం గ్రామానికి చెందిన శ్రీనివాస్ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. 2011 సంవత్సరంలో బైక్‌పై వెళ్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు ఆలేరు వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఇద్దరి వద్ద అక్రమ ఆయుధాలు రెండు(పిస్టల్స్)ను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి ఎస్ఐ ఎన్. వెంకటేశ్వర్లు నిందితులపై ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి యాదగిరిగుట్ట సీఐ కె. కృష్ణ కిషోర్ దర్యాప్తు చేసి కోర్టులో చార్జీషీట్ నమోదు చేశారు. కేసు విచారించిన భువనగిరి అసిస్టెంట్ సెషన్ జడ్జి ఇద్దరు నేరస్థులకు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రాష్ట్రానికి 33.88లక్షల ఇళ్లు కేటాయించాలి

● స్టాండింగ్ కమిటీ సమావేశంలో భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, అక్టోబరు 7: కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అతి తక్కువ ఇళ్లను కేటాయించి తీరని అన్యాయం చేసిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో తొలిసారి జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు 21.37లక్షలు, ఉత్తరప్రదేశ్‌కు 17.76లక్షలు, మహారాష్ట్రకు 13.64లక్షలు, గుజరాత్‌కు 13.64లక్షల ఇళ్లు మంజూరు చేసి, తెలంగాణకు కేవలం 1.58లక్షల ఇళ్లు మాత్రమే మంజూరు చేసి కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన కోటా కోసం ఏనాడూ పోరాడలేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో అర్హులైన పేదలను గుర్తించిందన్నారు. వచ్చే ఐదేళ్లలో కోటి ఇళ్లు నిర్మించేందుకు కేంద్ర యోచిస్తున్న తరుణంలో ఇప్పటి వరకు 33.88లక్షల ఇళ్లు అవసరముండగా, తెలంగాణకు ఈ ఏడాది ఆరు లక్షల ఇళ్లు కేటాయించాలన్నారు. అదేవిధంగా హైదరాబాద్ రాజధాని 50కిలోమీటర్ల మేర విస్తరించగా మెట్రోతో పాటు ఇతర రవాణ వ్యవస్థల సదుపాయం లేక ట్రాఫిక్ సమస్యలు తరుచూ తలెత్తుతున్నాయన్నారు. గ్లోబల్‌తో పోటీ పడేందుకు ప్రయత్నించే సమయంలో రాష్ట్రాలను సమీక్షించి మద్దతు ఇవ్వాలన్నారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి నగరాల చుట్టు పంచాయతీలు వేగంగా పట్టణీకీకరణ జరిగి మునిసిపాలిటీలుగా ఆవిర్భవించాయన్నారు. అనధికార లేఅవుట్ల మూలంగా సరైన రోడ్లు, మంచినీటి సరఫరా, మురుగు నీటి వ్యవస్థ ప్రణాళికాబద్ధంగా లేవని ఎంపీ చామల పేర్కొన్నారు.



ఢిల్లీలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ చామల

మహాలక్ష్మీ అలంకరణలో దుర్గాదేవి



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, అక్టోబరు 7: దేవి శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శ్రీపార్వతవర్ధిని అమ్మవారు మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. కొండపైన శివాలయంలో వైభవంగా కొనసాగుతున్న ఉత్సవ వేడుకల్లో సోమవారం ఐదోరోజు అమ్మవారికి పూజారులు ప్రత్యేకంగా రూ.3,700 నగదు మాలతో (రూ.200, రూ.100 నోట్లు) అలంకరించారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, అర్చనలు, పారాయణాలు, గాయత్రి జపాలు, లలిత సహస్రనామార్చనలు మధ్యాహ్నం పూజ నీరాజన మంత్ర పుష్పాలు అర్పించారు. సాయంత్రం నవావరణ పూజ, సహస్రనామార్చన నీరాజనం, మంత్ర పుష్పములు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

హరిహరులకు పూజలు

స్వామివారి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పార్వతవర్ధిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్పటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సంధ్య వేళ అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్పటిక మూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయన ఖజానాకు రూ. 18,79,262ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

పాలస్తీనాపై మారణకాండను వెంటనే ఆపాలి



- సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, సత్యం

నల్లగొండరూరల్, అక్టోబరు 7: పాలస్తీనా, గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న మారణకాండను వెంటనే ఆపాలని, దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నెల్లికంటి సత్యం అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద దాడులను నిరసిస్తూ సోమవారం నల్లబ్యానర్‌తో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఈ దాడులను ఆపాలని ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలని కోరారు. సామ్రాజ్యవాద అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం వల్ల పాలస్తీనా అతలాకుతలమైందని అన్నారు. ఉద్దేశపూర్వకంగానే పాఠశాలలు, ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ ఈ దాడులకు పాల్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం వల్ల దాదాపు 41వేల మంది మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ పౌరులు హత్యలు, అత్యాచారాలు, దాడులు, కిడ్నాప్‌లు వంటి అత్యంత హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, ఎల్.శ్రావణ్‌కుమార్, పబ్బు వీరస్వామి, బండ శ్రీశైలం, గరిజ రామచంద్రం, చినపాక లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, మహమ్మద్ సలీం, నరసింహ, గంజి మురళీధర్, ఎస్.రామలింగయ్య, పి.నర్సిరెడ్డి, మురళి, తుమ్మల పద్మ, చాపల శీను, దండెంపల్లి సత్తయ్య, రమేష్, మల్లం మహేష్, అక్బర్, కుంభం కృష్ణ రెడ్డి, లెనిన్, నలుపరాజు సైదులు, సుజాత, మన్నం బిక్షం, బొల్లు రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నల్లవస్త్రంతో నిరసన తెలుపుతున్న సీపీఎం, సీపీఐ నాయకులు

ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 7: జిల్లాలోని 17 దేవాలయాలకు సంబంధించిన ధర్మకర్తల మండలి నియామకానికి ఈ నెల 30వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు దేవాలదాయశాఖ ఏసీ అన్నెపర్తి సులోచన ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్ జారీ చేసిన 20 రోజుల్లో జిల్లా దే వాదాయశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

బహిరంగ వేలం

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 7: పట్టణంలోని తులసీనగర్‌లో గల శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయానికి సంబంధించి ఈ నెల 14వ తేదీన కొబ్బరికాయలు, పూజా సామగ్రిని విక్రయించడానికి రెండేళ్లకు అనుమతి ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కె.కుశలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు దేవాలయంలోని కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.



ఆత్మరక్షణకు మార్షల్ క్రీడ దోహదం : డీఈవో





పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో బొల్లారం భిక్షపతి

నల్లగొండ స్పోర్ట్స్, అక్టోబరు 7: ఆత్మరక్షణకు మార్షల్ క్రీడ దోహదపడుతుందని డీఈవో బి.భిక్షపతి అన్నారు. జిల్లా స్కూల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఉమ్మడినల్లగొండ జిల్లా అండర్-14, 17 బాలబాలికల తైక్వాండో జిల్లాస్థాయి ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాల, బాలికలు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి గెలుపొంది విజేతలుగా నిలవాలన్నారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో గెలుపొంది జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వాసుదేవరావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను 17వ తేదీన జోగులాంబగద్వాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి వివిధ కేటగిరిల్లో 130మంది బాలబాలికలు హాజరయ్యారు. ఈ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, గఫార్, వెంకన్న, తైక్వాండో కోచ్‌లు యూనుస్‌కమాల్, యాకస్వామి, ప్రణీత్ పాల్గొన్నారు.

ప్రభుత్వంపై మొదలైన వ్యతిరేకత

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



చిట్యాల, అక్టోబరు 7: రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై అనతికాలంలోనే ప్రజల నుంచి వ్యతిరేకత మొదలైందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు, కార్మికులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, మహిళలు, యువత ప్రభుత్వ తీరుపై తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారని అన్నారు. రైతు రుణమాఫీ పాక్షికంగానే జరిగిందని, అర్హులైన రైతులందరికీ బేషరుతుగా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వాలని, సాగుకు నాణ్యమైన కరెంటు ఇవ్వాలని కోరారు. రైతు భరోసా వెంటనే అమలుచేయాలన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కేసులకు భయపడరని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు. అనంతరం తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ కూరెల్ల లింగస్వామి, పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, నాయకులు సుంకరి యాదగిరి, గోధుమగడ్డ జలంధర్ రెడ్డి, జిట్ట బొందయ్య, ఆవుల అయిలయ్య, కొలను వెంకటేష్, సైదులు, అశోక్, సత్తయ్య, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిరుమర్తి లింగయ్య







కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న డీజే సభ్యులు

డీజేలకు అనుమతి ఇవ్వాలి

నల్లగొండ టౌన్, అక్టోబరు 7: డీజే సౌండ్‌లకు అనుమతి ఇవ్వాలని డీజే యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. డీజే యూనియన్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు డీజేల నిర్వాహకులు మాట్లాడుతూ దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా డీజేల వినియోగానికి అనుమతి ఇవ్వాలని కోరారు. డీజేలకు అనుమతి రద్దు చేయడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 800 కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో డీజే నిర్వాహకులు కత్తుల వాసు, జి.మల్లికార్జున్, పి.శ్రీను, మధు, కొండల్ తదితరులు పాల్గొన్నారు.










ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 33.0
కనిష్ఠం 23.4
నల్లగొండ
మంగళవారం 8 అక్టోబరు 2024






జనహృదయ నేతకు జన్మదిన శుభాకాంక్షలు
యువ కిషోరం, విద్యావేత్త, మృదుస్వభావి, పేదల పెన్నిధి
నియోజకవర్గ ప్రజల బాగోగుల గురించి
పరితపించే మన ప్రియతమ నాయకులు
అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళ్తున్న
మన నాగార్జున సాగర్
నియోజకవర్గ శాసనసభ్యులు
మా అన్న
శ్రీ కుందూరు జైవీర్‌రెడ్డి గారు
నేడు జన్మదినోత్సవం
జరుపుకుంటున్న
శుభసందర్భంగా వారికి
ఇవే మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు
తెలియజేస్తూ... వారికి నిండునూరేళ్లు
ఆయురారోగ్యాలను
దేవుడు ప్రసాదించాలని
కోరుకుంటూ..
శుభాకాంక్షలతో....
మీ.... మిట్టపల్లి వెంకటేష్

జీపీ కార్యాలయం దేవాలయం లాంటిది

● ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


లక్ష్మీపురం గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ రూరల్, అక్టోబరు 7: గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయం దేవాలయం లాంటిదని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామస్థులు ఎలాంటి సమస్యలు వచ్చినా మొదట సంప్రదించేది గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మాత్రమేనని అన్నారు. అధికారులు, నాయకులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి గ్రామస్థుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

15న ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శేషగిరిశర్మ

మిర్యాలగూడరూరల్, అక్టోబరు 7: ఈ నెల 15వ తేదీన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో శేషగిరి శర్మ తెలిపారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ ఆదేశానుసారం మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పీఏసీఎస్, ఐకేపీ కేంద్రాల్లో నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, తాగునీటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. సన్నరకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేర్వేరుగా నిర్వహించాలన్నారు. మండలంలోని అవంతీపురంలో రెండు, తుంగపాడు, తడకమళ్ల, రాయినిపాలెం, కాల్వపల్లిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో సైదానాయక్, ఏఈవోలు షఫీ, రమేష్, బిందు, గోపి, అఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించాలి


ఎమ్మెల్యే బీఎల్ఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

మిర్యాలగూడ, అక్టోబరు 7: మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ని బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జా జుల లింగంగౌడ్ కోరారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బీ ఎల్ఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు నుంచి నేటి వరకు బీసీలకు పదవిని కేటాయించలేదని అన్నారు. జనాభాలో 55 శాతానికి పైగా ఉన్న బీసీలకు అవకాశం రాలేదని అన్నారు. ఈ సారి జనరల్ మహిళకు చైర్మన్ పదవి రిజర్వు అయినందున బీసీ మహిళకు అవకాశం కల్పించాలని అన్నారు. గతంలో రెండుసార్లు జనరల్ స్థానాల్లో అగ్రకులాల వారికి అవకాశం ఇచ్చారని తెలిపారు. ఎస్సీలకు, ఎస్టీలకు ఒక్కోసారి అవకాశం దక్కినందున ప్రస్తుతం బీసీ మహిళకు అవకాశం కల్పించి సామాజిక న్యాయం పాటించాలని కోరారు. ఆయన వెంట బీసీ నాయకులు బంటు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

చండూరు, అక్టోబరు 7: చండూరు మండలంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని అమ్మ ఉమెన్స్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ ఫౌండేషన్ చైర్మన్ బరిగెల ఉమాశ్రీనివాస్ డిమాండ్ చేశారు. పాలకులు మారినా ప్రభుత్వాలు మారినా అభం శుభం తెలియని చిన్నారులపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ప్రతీ రోజూ ఏదో ఒక ప్రాంతంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులకు కఠిన శిక్షలు విధించకపోవడంతో ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతున్నారని అన్నారు.

సెరికల్చర్ రైతులకు లాభదాయకం


మల్బరీ తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త మాధురి

కొండమల్లేపల్లి, అక్టోబరు 7: సెరికల్చర్‌తో రైతులు అధిక లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లికి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ టి.మాధురి అన్నారు. మండలంలోని చింతకుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దేశముకోనికుంట చేపూరి ప్రమోద్‌గౌతమ్ సాగు చేస్తున్న మల్బరీతోటను సోమవారం ఆమె పరిశీలించారు. చిన్న, సన్నకారు రైతులకు మల్బరీ తోట సాగు, పట్టు పురుగుల పెంపకం ద్వారా రైతు లు నెలనెలా ఎకరానికి రూ.50 నుంచి 60 వేలు సంపాదించవచ్చని అన్నారు. సెరికల్చర్‌పై అవగాహన కల్పించడం కోసం గ్రామీణ యువకులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. షెడ్ నిర్మాణానికి వ్యవసాయ పరికరాలను కొనుగోలు చేయడానికి సెంట్రల్ సిల్క్ బోర్డు సబ్సిడీతో ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రమోద్ గీతం, భువనేశ్వరి, కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద ప్రాంగణం ప్రారంభం

దామరచర్ల, అక్టోబరు 7: మండలంలోని వాడపల్లి గ్రామ శివారులో కొలువైన శ్రీ మీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మిర్యాలగూడ ప్రముఖ వైద్యుడు శరత్‌బాబు, పద్మావతి దంపతులు రూ. 4లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాంగణాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్‌బాబు పద్మావతి దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొందూటి సిద్ధయ్య, ఈవో మృత్యుంజయ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే సామేల్‌పై ఆరోపణలు మానుకోవాలి'

శాలిగౌరారం, అక్టోబరు 7: ఎమ్మెల్యే సామేల్‌పై ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండపెల్లి కొమరయ్య, నాయకులు భూపతి వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా తుంగతుర్తి నియోజకవర్గంలో దళిత ఎమ్మెల్యేను చూసి ఓర్వలేక సొంత పార్టీ నేతలే ఎమ్మెల్యేకు, పార్టీకి విరుద్ధంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఎమ్మెల్యేను విమర్శిస్తే పెద్ద నాయకులతామని అనుకోవడం సరికాదన్నారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య, మాజీ సర్పంచులు అల్లి సైదులు, ననుబోతు అంజయ్య, మాదగోని అంజయ్య, దేవేందర్, గోపినాథ్, శంకర్, పరశురాం, రమేష్, రమేష్, ముత్తయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్వారీలో పనిచేసే అవకాశం కల్పించాలి

మిర్యాలగూడ, అక్టోబరు 7: రాళ్లు కొట్టి పొట్టపోసుకునే తమకు క్వారీలో పనిచేయడానికి అవకాశం కల్పించాలని దుర్గానగర్ రంగస్వామి సబ్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గానగర్, వెంకటాద్రిపాలెంకు చెందిన 150 కుటుంబాలవారు చింతపల్లి గ్రామంలోని సర్వేనెం. 384లో గల క్వారీలో గడిచిన 60ఏళ్ల నుంచి రాళ్లు కొట్టి వాటిని విక్రయిస్తూ జీవనం గడుపుతున్నామని అన్నారు. ఈ సర్వేనెంబర్ భూమిలో సమీకృత పాఠశాల నిర్మించడానికి క్వారీ పనిని నిలిపివేశారని అన్నారు. దీంతో 150వడ్డెర కుటుంబీకులు జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో విచారించి క్వారీలో పని చేసుకోవడానికి అనుమతించాలని సబ్ కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకటాద్రిపాలెం, దుర్గానగర్ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీమహాచండీదేవీగా అమ్మవారు


దర్వేశిపురంలో ప్రత్యేక అలంకరణలో రేణుకాఎల్లమ్మ

చింతపల్లి, నల్లగొండ కల్చరల్, కొండమల్లేపల్లి, నకిరేకల్, కనగల్, దేవరకొండ, శాలిగౌరారం, నార్కట్‌పల్లి, అక్టోబరు 7: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు శ్రీమహాచండిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు పలు మండపాల్లో అమ్మవారిని మందార, గులాబీపూలు, ఎరుపుచీరతో అలంకరించి శ్రీ మహాచండీదేవీగా పూజలు చేశారు. అనంతరం భక్తుల అమ్మవారిని దర్శించుకొని భక్తితో పూజించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. పలుచోట్ల సామూహిక కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మాలధారులు మండలం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల అమ్మవారిని దర్శించుకొని భక్తితో పూజించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. పలు మండపాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్ శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ పూరె లక్ష్మణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్, గోవర్ధన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్, రవీంద్రనగర్, పాతబస్తీ, నెహ్రూగంజ్ తదితర మండపాలను మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి దర్శించుకొని అమ్మవారికి పూజలు చేశారు. ఎన్టీఆర్ కాలనీలోని మండపం వద్ద శ్రీనివాస్ దంపతులు పూజలు చేసి భవానీమాతలకు భిక్షను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, దేవేందర్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, మెరుగు గోపి, గిరి, రమేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలోని దోనియాలలో అమ్మవారు భక్తులకు మహా చండీ రూపంలో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో బాబునాయక్, వరికుప్పల శేఖర్, గణేష్, అజయ్, దిలీప్, అనిల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

● నకిరేకల్ ఐశ్వర్యసాయి మందిరంలో ఘనంగా చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు రాఘవశర్మ, దుర్గి మురళి, దేవాలయ చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి ఉప్పల వెంకటరమణ, ఉపాధ్యక్షుడు తొనుపునూరు శ్రీనివాస్, రాంబాబు, స్వప్న, గోవిందరాజులు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

● కనగల్ మండలంలోని దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీ లలితత్రిపురాసుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బంగారు వర్ణం చీరతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

● దేవరకొండ పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీమాతను పార్వతీదేవి అలంకరణతో, రాజేశ్వరిమాతను శాకాంబరీ అలంకరణతో తీర్చిదిద్దారు. ఆమనగల్లు పీఠాధిపతులు శివనందస్వామి ప్రవచనాలు చేశారు. వాసవీకన్యకాపరమేశ్వరి దేవి జీవిత చరిత్రపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చీదెళ్ల వెంకటేశ్వర్లు, సభ్యులు సముద్రాల ప్రభాకర్, సుబ్బారావు, ఆలంపల్లి నర్సింహ, పానగంటి మల్లయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలోని అర్చకుడు రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో వైభవంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిమ్మనగోటి లింగయ్య, చంద్రమ్మ దంపతులు, నిమ్మనగోటి పరమేష్ సరిత, వెంకట్ సత్యవతి, నాగార్జున అంజలి, నరేష్ పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి పట్టణంలోని 13వ వార్డులో గల కనకదుర్గ కాలనీలో ప్రతిష్ఠించిన దుర్గాదేవీ మాత వద్ద చండీహోమాన్ని నిర్వహించారు. పలువురు దంపతులు హోమగుండం వద్ద హోమ పూజల్లో పాల్గొన్నారు. దసరా గుడి వద్ద అమ్మవారి పూజల్లో ఎస్ఐ క్రాంతికుమార్ పాల్గొన్నారు. వాసవీభవన్‌లో దుర్గామాతకు గాజులను అలంకరించి భక్తిశ్రద్ధలతో కొలిచారు.


చింతపల్లి : మాల్‌లో ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు


నల్లగొండ : మండపంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల


నకిరేకల్: చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పారిశుధ్య నిర్వహణ సమర్థంగా చేపట్టాలి

● జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి


వేములపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి

వేములపల్లి, అక్టోబరు 7: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజావాణికి వచ్చిన పౌరుల పట్ల స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ దరఖాస్తులను స్వీకరించి వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో డిజిటల్ సర్వేను సమర్థంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ సర్వే ద్వారా కుటుంబసభ్యుల వివరాలను సమగ్రంగా తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. దసరా నేపథ్యంలో వీధుల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శారదాదేవి, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, డీటీ కోటేశ్వరి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

మాడ్గులపల్లి: మండల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి సేవలు అందించాలని, ప్రభుత్వం పథకాలను ప్రజలకు చేరువయ్యేలా అధికారులు పనిచేయాలని అన్నారు. విధులను సక్రమంగా నిర్వహించాలని, గ్రామాల్లో అందరినీ సమన్వయం చేసుకుంటూ గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. విధుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సంగీత, అధికారులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు అధికంగా చేయించాలి

నకిరేకల్, అక్టోబరు 7: బీజేపీ సభ్యత్వ నమోదును కార్యకర్తలు అధికంగా చేయించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగిలయ్య అన్నారు. నకిరేకల్ పట్టణంలో సోమవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ప్రతి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ముందుండాలన్నారు. కార్యక్రమంలో మండల వెంకన్న, గుడుగుంట్ల సాయన్న, యానాల శ్రీనివాస్‌రెడ్డి, బండ మధూకర్‌రెడ్డి, గర్రె మురళి, కొండేటి శ్రీను, కందాళ సైదులు, గోపి, రాము తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కనగల్, అక్టోబరు 7: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో రూ.35 లక్షల నిధులతో కనగల్ హైస్కూల్‌లో టాయిలెట్స్, వాటర్‌ట్యాంక్ నిర్మాణ పనులకు సోమవారం శ్రీనివాస్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు మౌలిక వసతుల కల్పనకు మంత్రి చొరవచూపుతూ అవసరమైన నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమం లో నర్సింగ్ కృష్ణయ్యగౌడ్, సింగం పెద్దులు, కొంపల్లి శంకర్, రాయల శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

కొండమల్లేపల్లి, అక్టోబరు 7: మండలస్థాయిలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బాలరాజురెడ్డి కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

● ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ


దేవరకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

దేవరకొండ, అక్టోబరు 7: మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దేవరకొండ ముస్లిం మైనార్టీ మతపెద్ద ముక్తి మహమ్మద్ జావిద్ హుస్సేన్, ఈద్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అజీముద్దీన్ డిమాండ్ చేశారు. దేవరకొండలో జమియత్ ఉలేమాహింద్ ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నల్లబ్యాడ్జీలు, జాతీయజెండాలతో ముస్లింలు ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్తపై ఉత్తరప్రదేశ్‌కు చెందిన మందిర పూజారి యతి నర్సింహ ఆనంద్ సరస్వతి అనుచిత వ్యాఖ్యలు చేయడం ముస్లిం మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం నర్సింహ ఆనంద్ సరస్వతిపై దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు ముక్తి రిజ్వాన్, ఇలియాజ్‌పటేల్, పారూక్ మౌలానా, నజీర్ మౌలానా, మైనుద్దీన్, కలీం, ఫయాజ్, అఫ్రోజ్, జాఫర్, అలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పీఆర్టీయూ పోరాటం

దేవరకొండ, అక్టోబరు 7: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్ తెలిపారు. 317 బాధితుల నుంచి ఖచ్చితమైన నిర్ణయం తీసుకోవాలని జీవో 11, 12లను సవరించి బీఈడీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. గురుకుల పాఠశాలల సమయాన్ని 9 గంటలకు మార్చాలని, కేర్ టేకర్లను నియమించాలని, కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు టైం స్కేల్ వెంటనే ఇవ్వాలని, దసరా కానుకగా డీఏలు ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.

బెల్ట్ షాపుల నియంత్రణకు సహకరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చండూరురూరల్, అక్టోబరు 10: గ్రామాల్లో బెల్ట్‌షాపుల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం కోరారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆదేశానుసారం సోమవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో ఓంకారం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామస్థుల ఆధ్వర్యంలో 15 మందితో గ్రామాభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఐదుగురు మహిళలతో కలిపి అన్ని వయస్సుల వారికి ప్రాధాన్యం కల్పించి మొత్తం 15మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో యువత గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను పాడు చేసుకుంటున్నారని అన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడకుండా ఉండటానికి గ్రామంలో ఎలాంటి బెల్ట్‌షాపులు నిర్వహించకుండా, మత్తు పదార్థాల విక్రయాలు జరగకుండా ఈ కమిటీ పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కావలి ఆంజనేయులు, పోలు వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు భూతరాజు ఆంజనేయులు, సాపిడి రాములు, జక్కలి శ్రీను, రాజు, సైదులు, జాన్‌రెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నల్లగొండరూరల్, అక్టోబరు 7: పట్టణ శివారు ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎండీ సలీం అన్నారు. పట్టణంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో వేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అస్తవ్యస్తంగా తయారైందని అన్నారు. కొత్తగా శివారు ప్రాంతాల్లో చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించే విధంగా అధికారుల పర్యవేక్షించాలని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం గుంతలు తవ్వి సరిగా పూడ్చకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వార్డు కార్యదర్శిగా కోట్ల అశోక్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా వీరబోయిన పంచలింగంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు దండెంపల్లి సత్తయ్య, కందుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో కార్గో సేవలు ప్రారంభం

దామరచర్ల, అక్టోబరు 7: మండల కేంద్రంలో ఆర్టీసీ కార్గో సేవలను సోమవారం ఆర్టీసీ కార్గో సేవల జిల్లా అధికారి రవీంద్ర ప్రారంభించారు. పరిసర గ్రామాల ప్రజలు కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏజెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ప్రజావాణి'లో ఫిర్యాదుల వెల్లువ


కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న చండూరు మండలం చామలపల్లి గ్రామస్థులు

నల్లగొండ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లా వ్యాప్తంగా వివిధ మండ లాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు.

నక్షబాట, శివాలయం భూములను కాపాడాలి

చండూరు రూరల్ : చండూరు మండలం చామలపల్లి గ్రామ శివారులో గల సర్వే నంబర్ 249లో ఉన్న నక్షబాట, శివాలయం భూములను కాపాడాలని గ్రామస్థులు కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గ్రామానికి చెందిన కట్టికోల రామేశ్వరరావు గతంలో 2016లో ఇట్టి నక్షబాటను ఆక్రమించి బాటకు అడ్డంగా గోడ నిర్మించగా అట్టి గోడను గ్రామస్థులు కూల్చివేశారని, ఈ విషయమై అప్పట్లో 16 మందిపై కేసు పెట్టించాడని పేర్కొన్నారు. కాగా అది అక్కడితో ఆగిపోయిందని గ్రామస్థులు తెలిపారు. తిరిగి ఇటీవల అదే నక్షబాట స్థలంలో మళ్లీ గోడ నిర్మాణం చేపట్టడమే కాకుండా గ్రామానికి చెందిన శివాలయం భూములను కూడా ఆక్రమించి అమ్ముకోవాలని చూస్తున్నాడని వివరించారు.

నకిలీ పాస్‌పుస్తకాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టౌన్ : నకిలీ పాస్‌పుస్తకాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని పెద్దవూర మండలం సంగారం గ్రామానికి చెందిన ఊరే రామచంద్రయ్య కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. నకిలీ పాస్ పుస్తకాలపై విచారణ చేపట్టాలని స్థానిక ఎస్ఐ, సీఐలకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎస్ఐ, సీఐలు కుమ్మక్కై టాపిక్‌ను డైవర్ట్ చేస్తున్నారని తెలిపారు.

నందికొండలో బస్తీ దవాఖానను ప్రారంభించాలి

నాగార్జునసాగర్ : నందికొండ మునిసిపాలిటీ పరిధిలో పైలాన్ కాలనీలో రూ. 14లక్షలతో నిర్మించిన బస్తీ దవాఖానాన ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని 5వ వార్డు కౌన్సిలర్ రమేష్‌జీ కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్రకు వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం నిర్మించిన బస్తీదవాఖానను ఎన్నికల కోడ్ కార ణంగా ప్రారంభించలేదని అన్నారు. ప్రస్తుతం కోడ్ ముగిసి 10 నెలలు గడుస్తుందని, వెంటనే బస్తీ దవాఖానాను ప్రారంభించాలని కోరారు.

ఇంటిని కూల్చిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

సమాచారం ఇవ్వకుండా ఇంటిని కూల్చివేసిన నందికొండ మునిసిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని సాగర్ పైలాన్ కాలనీకి చెం దిన లక్ష్మణ్‌నాయక్ అదనపు కలెక్టర్ పూర్ణచంద్రకు వినతిపత్రం అంద జేశారు. కమిషనర్ డబ్బులు ఇవ్వలేదని కూల్చివేశారని ఫిర్యాదులో ఆరోపించారు. తన ఇంటిని అకారణంగా కూల్చివేసిన కమిషనర్ శ్రీను, సూపర్‌వైజర్ శివకృష్ణపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట నందికొండ 5వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్ రమేష్‌జీ ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్ కుటుంబానికి న్యాయం చేయాలి

మిర్యాలగూడ: ప్రమాదవశాత్తు సాగర్ ఎడమకాల్వలో పడి మృతి చెందిన అంగన్‌వాడీ టీచర్ పి. అనూష కుటుంబానికి న్యాయం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. రావువారిగూడెం అంగన్‌వాడీ టీచర్ అనూష కామేపల్లి అంగన్‌వాడి సెంటర్‌కు ఇన్‌చార్జిగా నియమించారు. ఈ నెల 5న అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించి రావువారిగూడెం వస్తుండగా ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందినట్లు తెలిపారు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారని, వారి చదువులకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరించాలని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, రూ. 20లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సుచిత, బైరెడ్డి రాణి, సబిత, భవాని, సక్కుబాయి, వనజ, సైదమ్మ, పార్వతి, రాధాబాయి, మాధవి, అరుణ, ధనలక్ష్మి, మాధవి, అలివేలు పాల్గొన్నారు.

కుమారుడిని చంపి తల్లి ఆత్మహత్య
కొంతకాలంగా మానసిక రుగ్మతతో సతమతం
•7లో..
బ్యాంకు అధికారులమని బురిడీ
• తక్కువ వడ్డీకి రుణాల పేరుతో మోసం



సీఎంఆర్ పర్సంటేజీ తగ్గించాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైస్‌మిల్లర్ల సంఘం నాయకులు (ఫైల్)

సన్నధాన్యం కొనుగోళ్లపై తకరారు

- సీఎంఆర్ పర్సంటేజీని 60శాతానికి తగ్గించాలంటున్న మిల్లర్లు
- లేదంటే చేయలేమని చేతులెత్తేస్తున్న వైనం
- వారంలో నూతన విధానం ప్రకటించకుంటే కొనుగోళ్లకు ఆటంకాలే
- చర్చించి విధానాన్ని ఖరారు చేసే యోచనలో ప్రభుత్వం

సన్నధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వ విధానం ఖరారవ్వకపోవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. ఈ ఏడాది నుంచి సన్నధాన్యాన్ని కూడా సీఎంఆర్ (కస్టమ్‌మిల్లింగ్ రైస్)కు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎంఆర్‌పై ఇప్పటివరకు ఉన్న విధానం ప్రకారం తాము బియ్యం ఇవ్వలేమని, సన్నధాన్యానికి నూతన విధానాన్ని ఏర్పాటుచేయాలని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు మిల్లర్లు ప్రభుత్వానికి ఇప్పటికే వినతిపత్రాలివ్వగా, దీనిపై పౌరసరఫరాలశాఖాధికారులు, వ్యవసాయాధికారులు, మిల్లర్లతో ప్రభుత్వం సమాలోచనలు చేస్తోంది. దసరా నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని నిర్ణయించినా, నూతన విధానం ఖరారవ్వకపోతే మిల్లర్లు సన్నధాన్యం కొనేదిలేదని చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వ నిర్ణయం కోసం అధికారులు, మిల్లర్లు, రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ వారంలో ప్రభుత్వం సన్నధాన్యం కొనుగోళ్లపై స్పష్టమైన విధానం ప్రకటించకపోతే ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఏర్పడనున్నాయి.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

గత ఏడాది సీఎంఆర్ ఇంకా పెండింగ్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గత వానాకాలం, యాసంగి సిజన్‌లో సీఎంఆర్ కింద ఇచ్చిన ధాన్యానికి సంబంధించి బియ్యం ఇంకా ప్రభుత్వానికి రావాల్సి ఉంది. నల్లగొండ జిల్లాలో వానాకాలంలో 13,833 మెట్రిక్ టన్నుల పెండింగ్‌లో ఉండగా, ఈ నెలాఖరులోగా అందజేయాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో మిల్లర్లకు అధికారులు సూచించారు. యాసంగిలో 77,663 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి రావల్సి ఉంది. ఈ బియ్యాన్ని సైతం నెలాఖరులోగా అందించాలని గడువు విధించారు. సూర్యాపేట జిల్లాలో సీఎంఆర్ బియ్యం ఇవ్వడంలో కొందరు మిల్లర్లు నిర్లక్ష్యం వహించడంతో ఆ మిల్లులను అధికారులు బ్లాక్‌లిస్టులో పెట్టారు. వానాకాలంలో 64 మిల్లులకు ధాన్యం సీఎంఆర్ కేటాయించగా 1,00,083 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి రావాల్సి ఉంది. ప్రధానంగా 10 మిల్లులు బియ్యం ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ధాన్యం విక్రయించిన ఘటనలు వెలుగులోకి రావడంతో ఆ మిల్లులను డిఫాల్టర్లుగా ప్రకటించి కేసులు కూడా నమోదు చేశారు. యాదాద్రి జిల్లాలో వానాకాలం సీజన్‌లో 47 రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయించగా, 26,334 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది. యాసంగిలో 1,10,712 మెట్రిక్ టన్నుల బియ్యం పెండింగ్‌లోఉంది. మిల్లుల సామర్థ్యానికి మించి ధాన్యం కేటాయించడంతో మిల్లింగ్‌లో జాప్యం జరిగిందని, అందువల్లే సకాలంలో సీఎంఆర్ ఇవ్వలేకపోయామని మిల్లర్లు చెబుతున్నారు.

పర్సంటేజీని 60 శాతానికి తగ్గించాలని కోరుతున్న మిల్లర్లు

సన్నధాన్యం మిల్లింగ్ నిబంధనలు మార్చాలని రైస్‌మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు అమలులో ఉన్న పాలసీ ప్రకారం బియ్యం ఇవ్వలేమని చేతులెత్తేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం సన్నధాన్యం సీఎంఆర్‌కు ఇస్తే క్వింటా ధాన్యానికి వానాకాలంలో అయితే పచ్చిబియ్యం 67కిలోలు, యాసంగిలో అయితే బాయిల్డ్ రైస్ 68కిలోల చొప్పున ప్రభుత్వానికి అందజేయాలి. ఇది తమకు నష్టమని మిల్లర్లు చెబుతున్నారు. వానాకాలం సీజన్‌లో వచ్చే బియ్యాన్ని ప్రభుత్వరంగసంస్థలు 17శాతం తేమతో కొనుగోలు చేస్తాయని, ఆ బియ్యాన్ని మిల్లింగ్ చేస్తే 60శాతానికి లోపే పచ్చి బియ్యం వస్తుందని, దీని ప్రకారం 60శాతం బియ్యమే ఇచ్చేలా నిబంధన మార్చాలని మిల్లర్లు కోరుతున్నారు. బాయిల్డ్ రైస్‌లోనూ అదే తేడా వస్తోందని, ఆ మేరకు సడలించాలని కోరుతున్నారు. దొడ్డురకాల ధాన్యం మిల్లింగ్ చేస్తే 64శాతానికి మించి బియ్యం రావడం లేదని, ఈ మేరకు సీఎంఆర్ 64శాతానికి కుదించాలని కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవపరిస్థితిని తెలుసుకొని నూతన విధానాన్ని ప్రభుత్వం ప్రకటిస్తే తప్ప తాము మిల్లింగ్ చేయలేమని మిల్లర్లు పేర్కొంటున్నారు.

టెస్ట్‌మిల్లింగ్ మిల్లింగ్ చేయాలంటున్న మిల్లర్లు

సీఎంఆర్ పర్సంటేజీ తగ్గించాలనే విషయంలో మిల్లర్ల డిమాండ్‌ను పరిశీలించేందుకు నిపుణుల కమిటీతో టెస్ట్‌మిల్లింగ్ చేయించాలని మిల్లర్లు సూచిస్తున్నారు. మిల్లులో సన్నధాన్యాన్ని శాంపుల్స్ తీసుకొని మిల్లింగ్ చేసి ఏ మేరకు బియ్యం వస్తుందో నిర్ధారించాలని కోరుతున్నారు. ఆ తరువాతే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సీఎంఆర్‌ను ఖరారు చేయాలని పేర్కొంటున్నారు.

వానాకాలంలో సీఎంఆర్ ఇలా..

జిల్లా	మిల్లులు	అప్పగించిన ధాన్యం	రావాల్సిన బియ్యం	వచ్చిన బియ్యం	పెండింగ్ (మెట్రిక్‌టన్నులు)
నల్లగొండ	240	3,22,754	2,17,577	2,03,744	13,833
సూర్యాపేట	64	2,08,113	1,39,436	39,352	1,00,083
యాదాద్రి	47	2,65,197	1,77,682	1,51,348	26,334

యాసంగిలో సీఎంఆర్ ఇలా..

జిల్లా	అప్పగించిన ధాన్యం	రావాల్సిన బియ్యం	వచ్చిన బియ్యం	పెండింగ్ (మెట్రిక్ టన్నులు)
నల్లగొండ	3,26,021	2,21,569	1,43,906	77,663
సూర్యాపేట	3,61,445	2,07,639	-	-
యాదాద్రి	2,70,6365	1,81,326	71,154	1,10,712

టమారా



- కిలో రూ.130 నుంచి రూ.150
- రాయలసీమ నుంచి నిలిచిన దిగుమతులు

మార్కెట్‌లో టమాట ధరలు ఆకాశాన్నంటిపోయాయి. సాధారణంగా కిలో రూ.30 నుంచి రూ.50లోపు ఉండే టమాట పక్షం రోజులుగా సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.130 నుంచి రూ.150 వరకు ఉండటంతో కొనుగోలుకు పేద, మధ్య తరగతి ప్రజలు వెనుకంజ వేస్తున్నారు.

– నల్లగొండ/నల్లగొండ టౌన్



ఉమ్మడి జిల్లాలో టమాట సాగు అరకొరగా ఉండటంతో అవసరాల నిమిత్తం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతోంది. జిల్లాలో టమాట అంతర్ పంటగా మాత్రమే సాగవుతోంది. అక్కడక్కడ ప్రత్యేకంగా టమాట సాగు చేస్తున్నా, తెగుళ్ల సోకి దిగుబడి రావడం లేదు. టమాట సాగును ఉద్యానశాఖ ప్రోత్సహించడం లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం కూరగాయల సాగుతో పాటు ఉద్యాన పంటల సాగుకు రూ.3 కోట్ల వరకు రాయితీ ప్రకటించినా, అది కాగితాలకే పరిమితమైంది. నిధులు విడుదల కాక లబ్ధిదారుల ఎంపిక కూడా జరగలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల సరిహద్దులోని నల్లగొండ జిల్లాలోని పలు మండలాలను కూరగాయల సాగుకు ఎంపిక చేయాలని నిర్ణయించినా అది ఆచరణ రూపం దాల్చలేదు. జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు నీటి వనరులు తగ్గడంతో రైతులు కూరగాయల సాగుపై దృష్టి సారించడం లేదు. దీనికి తోడు కూరగాయల సాగు చేసిన రైతులకు మార్కెట్‌లో ధరలు ఎప్పుడు పెరుగుతాయో ఎప్పుడు తగ్గుతాయో తెలియని అయోమయ పరిస్థితి ఉంది. దీంతో రైతులు పలుమార్లు నష్టపోయి కూరగాయల సాగును చేపట్టడం లేదు. రైతుల కంటే దళారులే టమాటను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

రాయలసీమ నుంచి తగ్గిన దిగుమతి

ఉమ్మడి జిల్లాలో టమాట సాగు గణనీయంగా పడి పోవడంతో రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం, కర్నూలు, ప్యాపిలీ ప్రాంతాల నుంచి వ్యాపారులు టమాట దిగుమతి చేసుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం రాయలసీమలో కురిసిన వర్షాలతో టమాట పూత రాలి దిగబడి తగ్గింది. దీంతో రాయలసీమలో ఉన్న కొద్దిపాటి టమాట దిగుబడి తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైకు అక్కడి రైతులు తరలిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో టమాట ధరలు మండిపోతున్నాయి. దిగుమతి తగ్గడాన్ని గమనించి హోల్‌సేల్ వ్యాపారులు మార్కెట్‌లో ధరను అమాంతం పెంచేయడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. దీంతో అందుబాటు ధరలో ఉన్న ఇతర కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు. టమాటకు ఆ ధర పెట్టే బదులు చికెన్ కొనుగోలు చేయడం మేలని సామాన్య ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ధరలు మండిపోతున్నాయి



మార్కెట్‌లో వారం, పది రోజులుగా టమాట ధరలు మండుతున్నాయి. ప్రధానంగా గడిచిన నాలుగైదు రోజుల నుంచి కిలో టమాట రూ.120 నుంచి రూ.150 వరకు ధర పలుకుతోంది. దీంతో సామాన్య, మధ్యతరగతి వాళ్లమైన మాలాంటి వారు టమాట కొనుగోలుచేసే పరిస్థితి లేదు. వీటితో పాటు అన్ని కూరగాయల ధరలు పెరిగాయి.

– ప్రసన్నలక్ష్మి, సావర్కర్‌నగర్

దిగుబడి తగ్గడమే కారణం




మార్కెట్‌లో టమాట ధర పెరుగుదలకు ప్రధానం కారణం దిగుబడి తగ్గడమే. ఇటీవల కురిసిన వర్షాలకు దిగుబడి పూర్తిగా తగ్గింది. దీనికి తోడు అరకొర వస్తున్న దిగుబడి, రాయలసీమ ప్రాంతం నుంచి తమిళనాడుకు తరలిపోతుండటంతో ధర విపరీతంగా పెరిగింది.

– గోవర్ధన్, కూరగాయల వ్యాపారి



30 నెలల్లో ఎస్‌ఎల్‌బీసీ పూర్తిచేస్తాం

- రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి రోడ్లు నిర్మిస్తాం
- జిల్లాలో రోడ్ల నిర్మాణానికి రూ.516కోట్లు
- నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు వేయిస్తా
- రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



దేవరకొండలో ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన పాలకమండలి, పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, అక్టోబరు 7: శ్రీశైలం సొరంమార్గాన్ని 30నెలల్లో పూర్తిచేసి జిల్లాకు సాగునీరు అందిస్తామని రోడ్లు, భవనాలశాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం దేవరకొండ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నాయిని జమున మాధవరెడ్డి, వైస్ చైర్మన్‌గా సర్వయ్యతోపాటు పాలకమండలి సభ్యుల ప్రమాణాస్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం సొరంగమార్గాన్ని గత సీఎం కేసీఆర్ పదేళ్లు పట్టించుకోలేదన్నారు. రూ.2 వేల కోట్లు కేటాయిస్తే ఎప్పుడో సొరంగమార్గం పూర్తయ్యేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాజెక్టులపై దృష్టిసారించారన్నారు. సొరంగమార్గంతోపాటు డిండి ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తిచేసి జిల్లాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు రహదారులు నిర్మిస్తామన్నారు. జిల్లాలో రోడ్ల నిర్మాణానికి రూ.516కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి బీటీరోడ్లు వేస్తామని, మాల్, మర్రిగూడ నుంచి రూ.30వేల కోట్లతో రిజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు వేయకుంటే తనపేరు వెంకట్‌రెడ్డినే కాదన్నారు. త్వరలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లకి రూ.5లక్షలు ఇస్తామన్నారు.

ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తాం

చింతపల్లి: డిండి ఎత్తిపోతల, ఇతర ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తిచేసి జిల్లా ప్రజలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలం పరిధిలోని గొడుకొండ్ల గ్రామపంచాయతీలో వేంకటేశ్వరనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దొంతం అలివేలు సంజీవరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతు సంక్షేమానికి కట్టుబడి రుణమాఫీ చేశామన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు ప్రజలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తామన్నారు. కురగాయాల క్రయ విక్రయాల కోసం రూ.5 కోట్లతో 25 రేకుల షెడ్లు ఏర్పాటు చేసి ట్రేడర్స్ సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలునాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, ముచ్చర్ల యాదగిరి, గుండ్లపల్లి నరసింహారెడ్డి, అంగిరేకుల గోవర్ధన్, మాస భాస్కర్, వూరె లక్ష్మణ్, పాల్గొన్నారు.

డిండికి నీరందించేందుకు కృషి : ఎమ్మెల్యే బాలునాయక్

ఎదుళ్ల నుంచి డిండి ఎత్తిపోతల రిజర్వాయర్‌కు నీరందించి జిల్లాలోని 3.5లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శ్రీశైలం సొరంమార్గం, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిసారించి నిధులు కేటాయిస్తున్నారన్నారు. కాంగ్రెస్ కోసం పనిచేసే కార్యకర్తలకు పార్టీ గుర్తింపునిస్తుందన్నారు. 40 ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న నాయిని మాధవరెడ్డి, సర్వయ్యలకు గుర్తింపు లభించిందన్నారు. నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని మంత్రి వెంకట్‌రెడ్డిని ఎమ్మెల్యే కోరారు. అనంతరం నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ, రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటోందన్నారు. మార్కెట్ నూతన పాలకవర్గం రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు పాటుపడాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లాలో 375కుపైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తోందన్నారు. త్వరలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. అనంతరం మార్కెట్ నూతన పాలకవర్గంతో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి చాయదేవి ప్రమాణాస్వీకారం చేయించారు. చైర్మన్‌గా నాయిని జమునమాధవరెడ్డి, వైస్‌చైర్మన్ సర్వయ్య యాదవ్, డైరెక్టర్లు దేప సుదర్శన్‌రెడ్డి, పగిడిమర్రి రఘురాములు, మాధవరం గోవర్ధన్‌రావు, పెద్దిశెట్టి సుధాకర్, బూతం సైదులు, ఎస్పీ దస్తగిరి, నేనావత్ కేశ్యనాయక్, వాంకుడోతు తావుర్యనాయక్, మేకల దీప, గుండబోయిన రాంబాబు ప్రమాణాస్వీకారోత్సవం చేశారు. నూతన పాలకమండలిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, జూలూరి ధనలక్ష్మి, బాలనారాయణగౌడ్, లోకసాని శ్రీధర్‌రెడ్డి, ఎంఏ.సిరాజ్‌ఖాన్, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, జాన్‌యాదవ్, వంగాల ప్రతాప్‌రెడ్డి, కృష్ణయ్య, పల్లా దేవేందర్‌రెడ్డి, కొర్ర రాంసింగ్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.









ప్రజా సమస్యల పరిష్కారానికే పోలీస్ గ్రీవెన్స్ డే



ఎస్పీకి మొక్క అందజేస్తున్న రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం నాయకులు

నల్లగొండ క్రైం, అక్టోబరు 7: ప్రజా సమస్యల పరిష్కారానికే పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జిదారుల వినతులు తీసుకొని ఎస్పీ మాట్లాడారు. ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు శాఖపై భరోసా కల్పించాలన్నారు. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

రిటైర్డ్ పోలీసుల సమస్యలు పరిష్కరిస్తాం

రిటైర్డ్ పోలీసుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం రిటైర్డ్ పోలీసు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోలి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఎస్పీ, ఏఎస్పీ రాములునాయక్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు ఎం.డేవిడ్, నాయకులు పి.భూపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, హసన్ అలీ, చకిలం శ్రీనివాసరావు, జి.విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, సాదత్‌అలీ, పాల్గొన్నారు.

